క్లుప్తంగా

మైసమ్మ జాతరకు భక్తుల రద్దీ



పెద్దకొత్తపల్లి: నాయినోని పల్లి మైసమ్మ జాతరకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి మైసమ్మ దేవతను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. వేసవికాలం కావడంతో రైతులు, వ్యవసాయ కూలీలతో పాటు ప్రజలు కూడా తరలి వచ్చారు. భక్తులు కొనుగోలు చేసిన మోటార్ సైకిళ్లకు, ఇతర వాహనాలకు మైసమ్మ దేవత వద్ద పూజలు చేయించారు. కొల్లాపూర్, నాగర్ కర్నూల్, వనపర్తి డిపోల నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసులను నడిపారు.

కూలర్ల వితరణ



కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాల మసీద్‌కు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కాయతి ఆశాదీప్‌రెడ్డి ఆదివారం కూలర్లను వితరణ చేశారు. రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలు ప్రార్థనలు చేసుకునే సమయంలో ఎండ వేడిని తట్టుకునేందుకు కూలర్లను ఏర్పాటు చేయించారు.

భీమ్‌దీక్ష వాల్‌పోస్టర్ విడుదల

తెలకపల్లి: మండలంలోని గడ్డంపల్లిలో భీమ్ దీక్ష వాల్ పోస్టర్‌ను ఆదివారం స్వేరోస్ జిల్లా జాయింట్ సెక్రెటరీ ధర్మారాజు, గడ్డంపల్లి మాజీ సర్పంచ్ లక్ష్మయ్యలు విడుదల చేశారు. ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 14 వరకు భీమ్‌దీక్ష చేపడుతునట్లు పేర్కొన్నారు. ఖమ్మంజిల్లా నెల కొండపల్లిలో నిర్వహించే భీమ్ దీక్ష ప్రారంభ సభకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్వేరోస్ ప్రధాన కార్యదర్శి రెడ్డపాకుల శివశంకర్, సంపత్ కుమార్, దార్ల కాశన్న, రమేష్, బాలస్వామి, మశయ్య, ఉషన్న, వెంకటయ్య, సుధాకర్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి



వెల్దండ: మండలంలోని బైరాపూర్ వాగుపై బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ ఆదివారం హైదరాబాద్‌లో గ్రామస్తులు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గత వర్షాకాలంలో నీటి ప్రవాహానికి బ్రిడ్జి కొట్టుకుపోయిందని వివరించారు. అప్పట్లో తాత్కాలికంగా సిమెంట్ పైపులు వేసి మట్టివేశారని తెలిపారు. రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ నాయకులు నర్సింహ, జోగునర్సింహ, పెద్ద అంజయ్య, రామస్వామి, పెద్దజంగయ్య, రాములమ్మ, చంద్రమ్మ, ఎల్లమ్మ ఉన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటే

కల్వకుర్తి: బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు రెండు ఒక్కటేనని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయతి విజయ్ కుమార్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎందుకు పోటీ చేయలేదో ప్రజలకు తెలపాలని పేర్కొన్నారు. బీజేపీ ఓట్ల కోసం, ఎన్నికల కోసం పోరాడుతోంది తప్ప ప్రజల కోసం కాదని వివరించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని వచ్చే స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీలకు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

'అపూర్వ' సమ్మేళనం

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 2006–07 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. దాదాపుగా 19 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు, గురువులు అప్యాయంగా పలుకరించుకొని చిన్నానాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ప్రస్తుత కుటుంబ నేపథ్యం, ఉద్యోగాలు, చేస్తున్న వ్యాపారాలపై చర్చించుకున్నారు. అనంతరం గురువులను సన్మానించారు. కార్యక్రమంలో గురువులు కొండారెడ్డి, సుధీర్‌రెడ్డి, మధుసూదన్‌రావు, గౌస్, ఉమాదేవి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

- ముస్తాబైన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయం



కొలువుదీరిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన మామిళ్లపల్లి దేవాలయం

ఉప్పునుంతల: మండలంలో ప్రసిద్ధి చెందిన మామిళ్లపల్లి లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 11వ తేదీ 16వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఉత్సవాల కోసం ఆలయాన్ని ముస్తాబు చేసి విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ వేముల నర్సింహ్మారావు, ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ నర్సింహులు తెలిపారు.

రోజువారి కార్యక్రమాలు.

మొదటిరోజు మంగళవారం స్వామివారికి అభిషేకం, స్వస్తి, పుణ్యావచనము, విశ్వక్సేన ఆరాధనము, పుణ్యావచనము, రక్షబంధనం, మృత్సంగ్రహణము, అధ్యాయనోత్సవం, అంకురార్పణముతో బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. 12వ తేదిన రెండో రోజు బుధవారం ఉదయం 8 గంటల నుంచి హోమములు, దేవతాహ్వానము, ధ్వజారోహణం, తీర్థప్రసాద వితరణము, రాత్రి భేరీ పూజ, హంసవాహన సేవ, తీర్థప్రసాద వితరణ, 13వ తేది గురువారం ఉదయం నిత్య హోమం, బలిహరణం, ఉదయం 9 గంటలకు ఎదుర్కోళ్లు, ఉదయం 10.16 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. సాయంత్రం భజన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఈనెల 14న ఉదయం పూజలు, రాత్రి 11 గంటలకు రథోత్సవం (తేరు) అదేవిధంగా ఈనెల 15న అశ్వవాహన సేవ దోపోత్సవం, ఈ నెల 16న ఉదయం 10 గంటలకు హోమం, బలిహరణము, శేష వాహన సేవ చక్రతీర్థం (నాగవెల్లి) నిర్వహిస్తునట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు, ఈఓ తెలిపారు.

వివిధ రకాల పోటీలు ఏర్పాట్లు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ యేడు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 13న కోలాటాల పోటీలు (ప్రథమ బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు, తృతీయ బహుమతి రూ. 10 వేలు), 15వ తేదీ మధ్యాహ్నం ట్రాక్టర్ ట్రాలీ రివర్స్ పోటీలు (ప్రథమ బహుమతి రూ.5016లు, ద్వితీయ బహుమతి రూ. 3016లు, తృతీయ బహుమతి రూ. 1016లు), 16న మధ్యాహ్నం రాష్ట్ర స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ. 50 వేలు, ద్వితీయ బహుమతి రూ. 40 వేలు, తృతీయ బహుమతి రూ. 30 వేలు, నాల్గో బహుమతి రూ. 20 వేలు, ఐదో బహుమతి రూ. 10వేలు నగదు అందజేయనునట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు తెలిపారు.

ఆలయ చరిత్ర...

పూర్వం రాఘవయ్య అనే బ్రాహ్మణుడు తన మామిడితోటలో ఇష్టదైవమైన దేవిమాతను ప్రతిష్ఠించి పూజలు చేసేవాడు. ఆ పక్కనే కొందరు రైతులు వ్యవసాయ చేస్తుండగా బయటపడిన లక్ష్మీనరసింహస్వామి విగ్రహాన్ని కూడా మామిడితోటలో పెట్టి పూజలు నిర్వహించేవారు. ఆ తర్వాత మామిడిచెట్ల మధ్యన వెలసిన ఆలయం చుట్టూ విస్తరించిన పల్లెను మామిళ్లపల్లిగా పిలువసాగారు. దీంతోపాటు ఆలయానికి కొద్ది దూరంలో దుందుభీ నది ప్రవహిస్తుండటంతో దుందుభీ తీర క్షేత్రమని కూడా వ్యవహరించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఈ ఆలయ నిర్మాణ తీరులో చోళుల పురావస్తు శిల్పకళలు ఉట్టిపడినట్లు కనిపస్తుండటంతో ఆలయ నిర్మాణం చోళుల కాలంలోనే జరిగినట్లు భావిస్తున్నారు. ఇప్పటికీ సుమారుగా 400ల ఎకరాల వరకు ఆలయానికి సంబంధించిన భూములు పరిసర గ్రామాల్లో ఉన్నాయి. ఆ భూములను కౌలుకివ్వగా వచ్చే ఆదాయవనరుతో నిత్యపూజలు, ప్రతియేటా పాల్గుణ శుద్ధ ఏకాదశి మొదలుకొని పాల్గుణ బహుళ విధియ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

బల్మూర్: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మండలంలోని కొండరెడ్డిపల్లిలో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనం, సీసీ రోడ్ల నిర్మాణాలకు ఆదివారం ఆయన శంకుస్థాపనతో పాటు మండల కేంద్రంలో రూ.16 లక్షలతో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య భారత్‌ సబ్ సెంటర్ భవనం, రూ.27లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ నూతన భవనాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాఘవులు, ఏఈ శ్రీనువాసులు, కార్యదర్శి లక్ష్మణ్, మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, రాంప్రసాద్‌గౌడ్, కాశన్నయదవ్, అంతటి మల్లేష్, సంపంగి రమేష్, ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు శివగౌడ్, గోవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, చంద్రమౌళి, సాయి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి అజ్యపాక సురేష్ అన్నారు. మండలంలోని బొందల పల్లిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే నిర్వహించారు. గ్రామంలో చిన్నచిన్న ఇళ్లలో ఉమ్మడి కుటుంబాలు జీవిస్తూ కాలం వెళ్లదీస్తున్నారని, అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ వ్యవస్థ కొన్ని వార్డులలో నిర్మించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు శివ, కాశీం తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలి

తెలకపల్లి: పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్ శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని గడ్డంపల్లిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లులేని పేదలకు గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిని ఇళ్ల స్థలాలకు కేటాయించి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ భూమిని వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఆ గ్రామశాఖ కార్యదర్శి బాబు, మల్లయ్య, బుచ్చన్న, నిరంజన్, బాలీశ్వర్ పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగుతున్న పూజలు



తిమ్మాజిపేట: మండలంలోని అప్పాజిపల్లి గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన వాల్మీకి మహర్షి ఆలయ ఆవరణలో భక్తులు భక్తిశ్రద్ధలతో యజ్ఞ హోమాలు నిర్వహించారు. రెండో రోజు ఆదివారం ఉదయం గణపతి పూజ, గోపూజ, ప్రాతఃకాల మండప పూజలు, ప్రతిష్టాదేవత పూజ, యజ్ఞహోమాలు, దాన్యాధివాసం తదితర పూజ కార్యక్రమాలు కొనసాగాయి. సోమవారం ఆలయం ఎదుట ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. వాల్మీకి మహర్షిని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి దర్శించుకున్నారు. మాజీ సర్పంచ్ తిరుపతమ్మ, నాయకులు జల్లి వెంకటయ్య, జల్లి రమేష్, యశ్వంత్, కుర్మయ్య, ఎల్లయ్య, జంగయ్య, మహేష్, వాల్మీకులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు మంజూరు చేయాలి

కొల్లాపూర్: అర్హులైన వారికి కొత్త రేషన్‌కార్డులను వెంటనే మంజూరు చేయాలని బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్ మాదిగ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రేషన్‌కార్డులు లేకపోవడంతో పేదలు అన్ని రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం అవుతున్నారన్నారు. నల్లమల అటవీ ప్రాంతంలోని ఆదివాసీలకు చాలామందికి రేషన్‌కార్డులు, ఆధార్‌కార్డులు లేవన్నారు. అర్హులైన వారిని గుర్తించి వెంటనే గుర్తింపు కార్డులతో పాటు రేషన్ కార్డులు మంజూరు చేయాలని ఆయన కోరారు. అధికారులు ఈ దిశగా చర్యలు చేపట్టాలన్నారు.

మిరప పంటకు మద్దతు ధర కల్పించాలి



తాడూరు: రైతుల ఎంతో కష్టపడి పండించిన మిరప పంటకు మద్దతు ధర రూ.25 వేలు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి కాశన్న డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని గుంతకోడురు, అల్లాపూర్, యాదిరెడ్డిపల్లి, మేడిపూర్ గ్రామాల్లో మిరప పంటను సీపీఎం ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో మిరప పంట విస్తారంగా సాగు చేశారన్నారు. అధిక వర్షాలు, తెగుళ్లతో పంట చాల వరకు దెబ్బతిన్నాయని మిగిలిన పంటలు సైతం దిగుబడి తగ్గిందన్నారు. మిర్చి క్వింటాల్ రూ.25 వేలకు పైగా అమ్మవలసి ఉండగా రూ.10 నుంచి రూ.12 వేలకు దళారులు కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్యామ్‌సుందర్, చంద్రయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ: ఇద్దరికి గాయాలు

వెల్దండ: మండలంలోని గుండాల సమీపంలో ఆదివారం సాయంత్రం బైక్, కారు ఢీ కొన్న ఘటనలో బైరాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరికి గాయాలయ్యాయి. బైరాపూర్ గ్రామానికి చెందిన యాదయ్య, శ్రీరాములమ్మ బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా గుండాల సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్నవారికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆదివారం మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా ఈదమ్మ మాంధాత దేవాలయానికి వెళ్లి అమ్మవారిని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. నిర్వాహకులు శివ, గణేష్, రాము, వెంకటేష్, రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి ఎంపికపై హర్షం

మన్ననూర్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్యే కోటా నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎంపిక చేయడంపై మాజీ వైస్ ఎంపీపీ, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి పెర్ముల వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి, పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆటో, బైక్ ఢీ: ఒకరికి గాయాలు

వెల్దండ: మండల కేంద్రంలో దర్గా వద్ద హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై ఆదివారం ఆగి ఉన్న ఆటోని బైక్ ఢీకొనడంతో ఆటో డ్రైవర్ పోలే యాదయ్యకు గాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం పెద్దాపూర్ గ్రామానికి చెందిన పోలే యాదయ్య ఆటో కల్వకుర్తి నుంచి పెద్దాపూర్‌కు వెళ్తున్నాడు. వెల్దండ సమీపంలోని దర్గా వద్ద ఆటో నిలిపాడు. అదేసమయంలో కల్వకుర్తి నుంచి వెల్దండ వైపు వెళ్తున్న బైక్ యాదయ్యకు కాళ్లకు తగిలింది. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్‌కు గాయాలుకాగా చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

బిజినేపల్లి: మండలంలోని పోలెపల్లి గ్రామానికి చెందిన పున్నమ్మ(43) ఒంటికి నిప్పంటించుకుని తీవ్రంగా గాయపడి శనివారం రాత్రి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పోలెపల్లి గ్రామానికి చెందిన పున్నమ్మ శుక్రవారం ఉదయం తన ఇంట్లోనే ఒంటికి నిప్పంటించుకుంది. విషయం గమనించిన కుటుంబ సభ్యులు మంటలార్పి హుటాహుటిన నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత



మాట్లాడుతున్న శ్రీఆదిత్య పరాశ్రీ స్వామిజీ

తిమ్మాజిపేట: ఆధ్యాత్మికతతో ప్రశాంతత కలుగుతుందని శ్రీఆదిత్య పరాశ్రీ స్వామిజీ అన్నారు. మండలంలోని బాజీపూర్‌లో శివాంజనేయ స్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామిజీ భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతిఒక్కరు ధర్మాన్ని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. పాశ్చాత్య సంస్కృతికి దూరంగా ఉండాలన్నారు. అంతకు ముందు స్వామిజీకి డప్పులు, మేళతాళాలు, పూర్ణ కుంభంతో ప్రజలు అఖండ స్వాగతం పలికారు.

ఉపాధ్యాయులు భవిష్యత్ మార్గదర్శకులు

కల్వకుర్తి రూరల్: ఉపాధ్యాయులు భవిష్యత్ మార్గదర్శకులు అని ఎస్ఐ మాధవరెడ్డి అన్నారు. పట్టణంలో క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ క్రికెట్ పోటీల ముగింపు వేడుకలు నిర్వహించారు. మొదటి బహుమతి కల్వకుర్తి ఉపాధ్యాయులు సాధించగా, రెండో బహుమతిని వంగూరు ఉపాధ్యాయులు కైవసం చేసుకున్నారు. షటిల్‌లో మొదటి బహుమతి అంజి రామకృష్ణ కల్వకుర్తి, ద్వితీయ బహుమతి శశాంక్ బాబురావు సాధించారు. అనంతరం క్లాస్‌మేట్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాస రాఘవేందర్ మాట్లాడుతూ క్రీడా పోటీలతో స్నేహభావం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ రాష్ట్ర కోశాధికారి పరమేశ్వర్, జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి లక్ష్మీనరసింహారావు, శోభన్ బాబు, గిరిజన అధ్యక్షుడు పోరెడ్డి రాజేందర్, అధ్యక్షుడు శ్రీధర్, సభ్యులు చంద్రశేఖర్, రఘురాంరావ్, నరేష్, ఉపాధ్యాయులు చంద్రమోహన్, శశాంక్ ప్రకాష్, సాయి, రమేష్ పాల్గొన్నారు.

మార్మోగిన తిరుమలేశుడి నామస్మరణ



లింగాల: లింగాలకు సమీపంలోని చెన్నేనిచెర్వు గట్టుపై వెలసిన తిరుమలేశుని బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. శనివారం తెల్లవారుజామున నుంచి రెండు రోజుల పాటు భక్తులు తిరుమలేశునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. తిరుమలేశుని విగ్రహాన్ని కొండపైకి ఊరేగింపుగా తీసుకెళ్లారు. పూజారి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆఖండదీపారాధన కొనసాగించారు. భక్తజన బృందంచే అఖండ భజనను నిర్వహించారు. తాగునీటి వసతిలో పాటు, భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో నిర్వాహకులు రఘునందన్, వెంకట్‌నారాయణ, భాస్కర్, స్వామి, శ్రీశైలం, చంద్రమౌళి, మన్నెం, రమాకాంత్, బాలస్వామి, ఉమాపతి, క్రాంతి, అశోక్, శ్రావణ్, విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



వెల్దండ: మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు దేవేందర్‌ముదిరాజ్, కార్యకర్తలు ఆదివారం బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి సమక్షంలో బీజేపీలో చేరారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కల్వకుర్తి నియోజకవర్గ కన్వీనర్ శేఖర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు కుర్మిద్ద యాదగిరి, మాజీ సింగిల్‌విండో చైర్మన్ మోహన్‌రెడ్డి, నాయకులు శ్రీశైలం ముదిరాజ్, విష్ణుగౌడ్, కొండల్‌ముదిరాజ్, రమేష్‌ముదిరాజ్, శ్రీశైలం, సైదులు తదితరులు ఉన్నారు.

సత్యసాయి సేవ సంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని సత్యసాయి సేవ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 483 మందికి పరీక్షలు చేశారు. అనంతరం అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. పరీక్షలకు హాజరైన వారికి అన్నదానం చేశారు. వైద్యులు స్వామి, విజయ్, పూజిత, రాజేష్, రమ్యశ్రీ, మనోజ్ కుమార్, నవనీత, శ్రీధర్‌లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లోకి..



ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ భర్త మాధవరం రాజల్‌రావు, ప్రభాకర్‌రావులు ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాజల్‌రావు, ప్రభాకర్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు, మాజీ సర్పంచు దామోదర్, రామస్వామి, మురళీధర్‌రావు పాల్గొన్నారు.

ప్రారంభానికి ముందే శిథిలావస్థలో భవనాలు



శిథిలావస్థకు చేరిన మహిళా సంఘాల భవనం

తాడూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ భవనాల సముదాయ ఆవరణలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలు ప్రారంభించకుండానే శిథిలావస్థకు చేరుకున్నాయి. గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో 10 ఏళ్ల కిందట రూ.6 లక్షలు వెచ్చించి మోడల్‌గా నిర్మించిన ప్రభుత్వ భవనం అధ్వానంగా తయారయ్యాయి. అదే విధంగా ఆవరణలో డ్వాక్రా భవనాలు అప్పట్లో రూ.10 లక్షలు వెచ్చించి నిర్మించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజాధనం వృథా అవుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాలు వినియోగంలోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా బొడ్రాయి పండుగ



బాజీపూర్‌లో బోనాలతో వెళ్తున్న మహిళలు

తిమ్మాజిపేట: మండలంలోని బాజీపూర్ శివాంజనేయస్వామి పునః ప్రతిష్ఠ కార్యక్రమాల సందర్భంగా గ్రామంలో ఆదివారం బొడ్రాయికి కుంకుమార్చన చేసి భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి ఆలయం ఎదుట పూజారుల వేద మంత్రోచ్ఛరణలు, జైశ్రీరాం, హరహర మహదేవ్ భక్తుల నినాదాల మధ్య ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం డప్పులు, మంగళ వాయిద్యాలతో మహిళలు బోనాలు ఎత్తుకొని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. మొదటి రోజు విఘ్నేశ్వర పూజ, రక్షాబంధనం, మండపారాధనలు, గణపతి హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించగా రెండోరోజు హోమాలు, యంత్ర ప్రతిష్ఠాపనలు నిర్వహించగా ఆదివారం భక్తుల కోలాహలం మధ్య ధ్వజ ప్రష్టాపన చేశారు. ఈ సందర్భంగా భక్తులు పారవశ్యంతో ఉప్పొంగిపోయారు.

పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యం

పెంట్లవెల్లి: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం మండలంలోని జటప్రోల్‌లో మాజీ ఎంపీపీ గోవింద్‌గౌడ్ తల్లి చంద్రమ్మ జ్ఞాపకార్థం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మంత్రి హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతిఒక్కరూ సేవభావం కలిగి ఉండాలన్నారు. నెలలో రెండు ఆదివారాలు ఉచితంగా వైద్యం చేయడంపై డాక్టర్ చైతన్యగౌడ్‌ను అభినందించారు. గ్రామానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు అయ్యిందన్నారు. త్వరలో రూ.150 కోట్లతో పాఠశాల నిర్మిస్తామన్నారు. అదేవిధంగా 5 ఎకరాలలో కొప్పునూర్, జటప్రోల్ గ్రామాల సరిహద్దుల్లో 10 వేల టన్నులు నిల్వ ఉండే విధంగా భారీ గోదాంలను నిర్మించనున్నట్లుగా ఆయన వివరించారు. రామన్‌గౌడ్, భీంరెడ్డి, నల్లపోతుల గోపాల్, నాగిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ కబీర్, వెంకటేష్, గోవింద్, ఆది, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083
నాగర్‌కర్నూల్ - జి. సంపత్ కుమార్ - 88865 67081
కొల్లాపూర్ - వై. కురుమూర్తి - 79979 58205
అచ్చంపేట/కల్వకుర్తి - యం. విజయ్ - 99630 23777

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

పి. మధుసూదన్ గౌడ్ : 90100 06785